

# కృష్ణపట్నం పట్టపోళ్ళ భవిష్యత్ ఏమిటి?

కృష్ణపట్నం 'అల్ట్రా మెగా థర్మల్ ప్లాంట్' ఇంకా కట్టలేదు. కేవలం పోర్టు విస్తరణే 16 గ్రామాల పట్టపోళ్ళ (మత్స్యకారుల) బతుకును ప్రశ్నార్థకం చేసింది. పోర్టు విస్తరణ కూడా నిజానికి ఇంకా జరగలేదు. దానికోసం తీరం మీద జరుగుతున్న లెవెలింగ్ పనులే చేపల వేటను చంపేశాయి. అంతా అయిపోయి 5,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు థర్మల్ కేంద్రా లొకపక్క, వాటికోసం బొగ్గు దిగుమతి చేసుకోవడానికి ప్రధానంగా ఉద్దేశించిన పోర్టు మరొకపక్క పూర్తి స్థాయిలో వచ్చేస్తే అక్కడ మత్స్యకారులనే వారు ఒక్కరైనా మిగులుతారా?

రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఒకానొక సంకేతంగా కృష్ణపట్నం పత్రికలలో తరచుగా దర్శనం ఇస్తుంటుంది. దానివెనక ఉన్న చీకటి కథ మాత్రం పత్రికలలో కనిపించదు. ప్రాజెక్టులకు భూములు తీసుకునే టప్పుడు స్వంత భూమి ఉన్న రైతులకు ఎకరానికింత నష్టపరిహారం ఇచ్చి, ఇళ్ళు ఖాళీ చేయవలసి వచ్చే వారికి ఎక్కడో ఒకచోట ఇళ్ళ స్థలం చూపిస్తే సరిపోతుందని ప్రభుత్వం భావిస్తుంది. చట్టం గుర్తించే యాజమాన్య హక్కేదీ లేకుండా ఆ నేల మీద, ఆ ప్రకృతి మీద ఆధారపడి బతికే జనం వాళ్ళ లెక్క లోకేరారు.

కానీ ఈ 'అభివృద్ధి' చాలా ప్రాథమిక దశలో ఉండగానే ప్రభుత్వం దాచి పెట్టిన విషయాలు బయటపడుతున్నాయి. ఈ తీరం వెంబడి ఉన్న గ్రామాలలో నివసిస్తూ సముద్రంలో, కండలేరు నదిలో, బకింగ్‌హాం కాలవలో చేపలు, రొయ్యలు పట్టుకొని జీవించే జనం వేట దొరకక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పోర్టుకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టే చోట నేల లెవెలింగ్ చేయడం కోసం అవసరమైన మట్టిని పోర్టు యాజమాన్యం సముద్రంలో నుండే 'డ్రెడ్జింగ్' చేసి తీసుకొస్తోంది. మట్టి తవ్వుకుంటూ, ఇక్కడి మట్టి అక్కడ పోసుకుంటూ, హడావుడిగా తిరిగే 'తవ్వోడల' పుణ్యాన జలజీవాల పునరుత్పత్తి బాగా దెబ్బ తినింది.

మొదట రాష్ట్ర ప్రభుత్వం ఇదేమీ తనకు పట్టనట్టు, తన నిర్ణయాలతో దీనికేమీ సంబంధం లేనట్టు నటించింది. ఊరు ఖాళీ చేసిపోవలసి ఉన్న ఆదాలనగర్, మిద్దిరేవు, రామలింగాపురం అనే మూడు మత్స్యకారుల గ్రామాలకు మాత్రం ముత్తుకూరు దగ్గర కాలనీ కట్టిస్తానంది. పోర్ట్‌లో ఉద్యోగాలు ఇస్తామని కూడా అంటున్నారు గానీ అది అబద్ధం అని అందరికీ తెలుసు. నిర్మాణం జరుగుతున్న దశలో మట్టితట్టలు మోసే పని కొంతమందికి దొరుకుతుంది గానీ ఆ తరువాత మారుమూల గ్రామాల మత్స్యకారులు చేయగల పనేమీ పోర్ట్‌లో దొరకదు.

కానీ ఆ మూడు గ్రామాల వారికేకాక మొత్తం 16 గ్రామాల పట్టపోళ్ళ జీవనం ఇప్పటికే దెబ్బతినింది, ఇంకా పెద్దె త్తున దెబ్బతినబోతోంది. నేలటూరు, కృష్ణపట్నం, ఆదాలనగర్, రామలింగాపురం, ఈపూరు వెంకన్నపాలెం, మిట్టపాలెం, కోనేటి మిట్ట, బీచికాలనీ, మద్దిరేవు, గుమ్మళ్ళ దిబ్బ, లింగవరం, వరగలి, మోమిడి గ్రామాలలో వెయ్యి కుటుంబాలకు పైబడి మత్స్యకారులుంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ముందుకొచ్చి, డ్రెడ్జింగ్ పనులు నడుస్తున్నంతకాలం ఈ సమస్య ఉంటుందని చెప్పి కొంత నష్టపరిహారం ఇచ్చే ఆలోచన చేస్తున్నదని వింటున్నాం.

తూర్పు గోదావరి జిల్లా తాళ్ళరేవు దగ్గర రిలయెన్స్ కంపెనీ వారి సహజవాయు ప్రాజెక్టు విషయంలోనూ ఇదే జరుగు తున్నది. అక్కడ కూడా ప్రాజెక్టు నిర్మాణాల నిమిత్తం నేలను లెవెల్ చేయడానికి అవసరమైన మట్టిని సముద్రం నుండే డ్రెడ్జర్ల సహాయంతో తవ్వి తీసుకొచ్చారు. కృష్ణపట్నం రేవు కండలేరు సముద్రాన్ని కలిసే చోటికి దగ్గరున్నట్టే అది గాడేరు సముద్రాన్ని కలిసే చోటికి దగ్గిర. అక్కడ కూడా మత్స్యకారులకు వేట బాగా ఉండేది. కానీ 'తవ్వోడల' పుణ్యాన ఇసుక అడ్డదిడ్డంగా మేట వేసి, నీళ్ళు బురదై, జలజీవాల పునరుత్పత్తి దెబ్బతినడం, మత్స్యకారుల పడవల రాకపోకలు కష్టతరం కావడం జరిగింది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, డ్రెడ్జింగ్ ఎంతకాలం జరగబోతుందో అంతకాలానికి మాత్రం నెలకింత అని లెక్కగట్టి మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చింది. ఇక్కడ కూడా ఆ విధంగా ఇచ్చే ప్రతిపాదన ఉన్నట్టుంది.

కానీ రేవు నిర్మాణం పూర్తయి డ్రెడ్జర్లన్నీ వెళ్ళిపోయిన తరువాత కూడా సమస్య ఉంటుంది. ఉండడమేకాదు, అప్పుడే అసలు సమస్య మొదలవుతుంది. అందుకే ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి నాలుగు కాసులు చేతిలో పెట్టిందని మురిసి పోవద్దని మత్స్యకారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

మన రాష్ట్రంలో ఎక్కడా ఇప్పటిదాకా 1000 మెగావాట్ల సామర్థ్యాన్ని మించిన థర్మల్ కేంద్రాలు లేవు. కృష్ణపట్నంలో ఒకటి 4,000 మెగావాట్లు, మరొకటి 1,600 మెగావాట్లు, మొత్తం 5,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు థర్మల్ కేంద్రాలు అక్కడ రాబోతున్నాయి. వీటికోసం రోజుకు 5.84 లక్షల ఘనపు మీటర్ల నీళ్ళు సముద్రం నుండి తీసుకుంటారు. ఈ నీళ్ళు తిరిగి సముద్రంలోకే పోతాయిగానీ ఇంత పెద్దెత్తున ప్రతి రోజూ సాగర మధనం జరుగుతుండగా మత్స్యకారులు పడవ లేసుకుని చేపల వేటకు పోయి వస్తుంటారనుకుంటే భ్రమే.


జాతీయ పునరావాస విధానం రాబోతున్నదని చాలా ఏళ్ళుగా వింటున్నాం. అటువంటి బిల్లు ఒకటి ఇప్పుడు పార్లమెంటు ముందు ఉంది. త్వరలో అది చట్టం కాబోతున్నదని ప్రధానమంత్రి మొన్నటి గణతంత్ర దినోత్సవం నాడు అన్నారు. దానికేమీ తొందర లేదుగానీ ప్రాజెక్టులకు మాత్రం ఎక్కడలేని తొందర ఉంటుంది.


కాగా, కాలుష్యం ప్రమాదమూ చాలా ఉంటుంది. థర్మల్ కేంద్రాల నుండి వచ్చే ప్రధానమైన కాలుష్యం బూడిద. ఈ రెండు ప్లాంట్లలో పెద్దదైన రిలయన్స్ వారి 4000 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని విదేశీ బొగ్గుతో నడుపుతారనీ, దానిలో బూడిద మన బొగ్గుకంటే మూడవ వంతు తక్కువ ఉంటుందనీ అంటున్నారు. అయినప్పటికీ 4,000 మెగావాట్ల థర్మల్ కేంద్రం నుండి వెలికి వచ్చే బూడిద రామగుండంలోని ఎన్‌టిపిసి థర్మల్ కేంద్రం కంటే రెండున్నర రెట్లు ఎక్కువ ఉంటుంది. రెండవ థర్మల్ కేంద్రం ప్రధానంగా మన బొగ్గుతో నడుస్తుంది కాబట్టి బూడిద కాలుష్యం పూర్తి పరిమాణంలో ఉంటుంది.

ఈ బూడిదను నీటితో కలిపి పెద్ద పెద్ద చెరువులలో ఉంచుతారనీ, దానిని ముడిసరుకుగా వాడుకునే పరిశ్రమలు ఆ బూడిదను ఎప్పటికప్పుడు తీసుకుపోతుంటాయనీ, అందువల్ల బూడిద కాలుష్యం ప్రమాదం ఎక్కువ ఉండదనీ అంటారు గానీ ఇది చెప్పి నంత సజావుగా జరగదని అనుభవం తెలుపుతుంది. రామగుండం థర్మల్ కేంద్రమే దీనికి ఉదాహరణ. ఎండల కాలంలో బూడిద ఎండి చుట్టూ ఉన్న ఆవాసాలపైన, పొలాలపైన మంచులాగ కమ్ముకొని అక్కడి వారి జీవితాన్ని దుర్భరం చేస్తుంది. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ సముద్రం పక్కన ఉంటుంది కాబట్టి, పగటి సమయంలో గాలి సముద్రం వైపు వీస్తుంది కాబట్టి, అక్కడ ఈ బూడిద సముద్రం మీదికి పోతుంది. దాంతోపాటు తీరంమీద నెలకొనబోయే జనావాసాల మానవ కాలుష్యమూ సముద్రంలోకే పోతుంది. ప్రాజెక్టు కాలనీ తీరానికి అర్ధ కిలోమీటర్ లోపలికి ఉండాలని పర్యావరణ అనుమతి పత్రం అంటుంది కాని దాని మురుగునీరు సముద్రంలోకి వెళ్ళదన్న భరోసా ఏమీలేదు. అందువల్ల రాబోయే కాలంలో ఈ తీరంలో చేపల వేట సాధ్యపడదు. అంటే 16 గ్రామాల మత్స్యకారులూ తట్టాబుట్టా సర్దుకొని పిల్లాజెల్లాతో సహా వెళ్ళిపోవలసి ఉంటుంది. వాళ్ళకు థర్మల్ ప్రాజెక్టులోనో, పోర్టులోనో పనులు కల్పిస్తామన్న హామీ ఇచ్చి వాళ్ళ నోళ్ళు మూయించే ప్రయత్నం నాయకులు ఇప్పటికే చేస్తున్నారు. కాని ఇది వట్టి దగా. అభివృద్ధి పేరిట ఇప్పుడు మన నాయకులు రాష్ట్రంలోకి ఆహ్వానిస్తున్న ఏ పరిశ్రమలోనూ పెద్ద చదువులు లేని వారికి పిడికెడుకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదు.

'ఇంకెక్కడన్నా పోయి చేపలు పట్టుకోండి' అంటుందేమో ప్రభుత్వం. ఎక్కడికి పోయినా ఇప్పటికే అక్కడ చేపల వేట చేస్తూ బతుకుతున్న వారు ఉండవచ్చు. అప్పుడు వారికీ వీరికీ కొట్లాట పెట్టడమే కదా ప్రభుత్వం చేసేది! ఎక్కడైనా ఖాళీ ఉన్నా అక్కడ నివాసానికి కాలనీ కావాలి, సహజంగా ఏర్పడిన రేవు లేకపోతే జెట్టీ కావాలి. 'పునరావాసం' అనే మాటకేమైనా అర్థం ఉంటే ఇవన్నీ కల్పించాలి. అటువంటి ఆలోచనేదీ ప్రభుత్వం చేయడం లేదు. ఇటువంటి వాళ్ళకోసం జాతీయ పునరావాస విధానం రాబోతున్నదని చాలా ఏళ్ళుగా వింటున్నాం. అటువంటి బిల్లు ఒకటి ఇప్పుడు పార్లమెంటు ముందు ఉంది, త్వరలో అది చట్టం కాబోతున్నదని ప్రధానమంత్రి మొన్నటి గణతంత్ర దినోత్సవం నాడు అన్నారు. దానికేమీ తొందర లేదుగానీ ప్రాజెక్టులకు మాత్రం ఎక్కడలేని తొందర ఉంటుంది. ఆ బిల్లులో ఏముందో ప్రజలకు తెలీదు. అదింకా చట్టం కాలేదు. సమాజం దాని మంచి చెడులు చర్చించలేదు. అంత లోపల లక్షలాదిగా ప్రజల విస్థాపన మాత్రం జరిగి పోతుంటుంది.

కృష్ణపట్నం తీరప్రాంత మత్స్యకారులు ఈ వాస్తవాలను అర్థంచేసుకొని తమ హక్కులకూ, జీవనానికీ ఏ విలువా లేనట్టు నడుచుకుంటున్న ప్రభుత్వానికి ప్రజలంటే ఏమిటో, వారి సంకల్పం ఎటువంటిదో నేర్పించాలని కోరుతున్నాం. సమాజంలోని సకల ప్రజాతంత్ర శక్తులూ, మంచినీ మానవతనూ అభిమానించే వ్యక్తులూ వారికి అండగా నిలబడాలని కోరుతున్నాం.


**మానవహక్కుల వేదిక (HRF)**

నెల్లూరు జిల్లా శాఖ


**15-2-2008**